
క్లుప్తంగా

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఫ్యూసిస్ మైక్రోఫైనాన్స్ కంపెనీలో 4బ్రాంచ్ మేనేజర్ పోస్టులు, 40రిలేషన్‌షిప్ ఆఫీసర్స్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఎంబీఏ అభ్యర్థులు అర్హులన్నారు. శ్రీరామ్ చిట్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీలో 25మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ పోస్టులకు ఏదైన డిగ్రీ అర్హత గలవారు అర్హులన్నారు. ఈ పోస్టులకు 18–35ఏళ్ల లోపు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అర్హత ఆసక్తి గల నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



జాబితాను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, గుడిరేవు, తాళ్లపేట, రెబ్బనపల్లి, కొర్విచెల్మ ఉన్నత పాఠశాలలను జిల్లా మానిటరింగ్ బృందం సభ్యులు గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన నిర్మాణాత్మక పరీక్షలు, అంతర్గత మూలపరీక్షలలో వచ్చిన మార్కులు, ఆన్లైన్లో నమోదైన మార్కులను పరిశీలించారు. కార్యక్రమాల్లో బృందం సభ్యులు చిన్నయ్య, శంకర్ గౌడ్, రాజన్న, రూపాచారి, కొండయ్య, నీలేష్ కచ్వాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి(తాండూర్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల సైన్స్‌సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో తాండూర్ మండలం అచ్చులాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత పాటల పోటీలో ప్రథమ బహుమతి, 7వ తరగతి విద్యార్థిని ఏస్నిత ఉపన్యాస పోటీలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్ తెలిపారు.

దండేపల్లి: ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయి ఆంగ్ల ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో దండేపల్లి మండలం వెల్గనూరు ఉన్నత పాఠశాలకు చెందిన కె.శ్రీ వైష్ణవి అంత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. ఈమెతో పాటు, పాఠశాలకు చెందిన అక్షయ బృందం ఆంగ్ల డ్రామా పోటీల్లో జిల్లా తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారిని పాఠశాలలో గురువారం అభినందించారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, నాయకులు

భీమారం: ఈ నెల 25న జరిగే గాంధారి మైసమ్మ జాతర పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయకపోడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సదానందం, నాయకులు తైనేని రవి, రొడ్డ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ మేరకు ఆదివాసీ నాయకులు రవి మాట్లాడుతూ.. 23న గోదావరి జలాల సేకరణ, 24న సదర్ భీమన్న, పోచమ్మ తల్లికి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న జరిగే జాతర, ధర్బార్‌కి చెన్నూరు ప్రాంతంలోని గిరిజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

కార్మికులకు ఉచిత రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జన్నారం: మండలంలోని పొనకల్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యంలో సీఎస్‌సీ వారి సహకారంతో ఉచిత రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో లేబర్‌కార్డు కలిగిన కార్మికులకు ఉచితంగా 30రకాల రక్త పరీక్షలు చేశారు. యువశక్తి యూత్ సభ్యులు కార్మికులకు ఈ విషయం తెలియజేసి, రక్త పరీక్షలు చేసుకునేలా ప్రోత్సహించారు. సీఎస్‌సీ హెల్త్‌కేర్ జిల్లా సమన్వయ కర్త కొండలరావు మాట్లాడుతూ.. కార్మికులకు రక్త పరీక్షలు చేసుకోవడం ద్వారా ఏదైనా వ్యాధి సోకినా బయటపడే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా చికిత్స తీసుకోవచ్చని సూచించారు. ఉచిత రక్త పరీక్షల అవకాశాన్ని కార్మికులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సిబ్బంది సుగుణ, దినేశ్, సుమలత, యువశక్తి యూత్ అధ్యక్షుడు శేఖర్ తదితరులున్నారు.

కలుషిత నీటితో సతమతం..!

- మూడేళ్లుగా గోదావరి నీటికి నోచుకోని సోమగూడెం కార్మిక కుటుంబాలు
- ఓపెన్‌కాస్టు నీటి సరఫరాతో పనిచేయని ప్యూరిఫైడ్‌లు
- సుదీర్ఘ కాలంగా నీటి పరీక్షలకు దూరం



సోమగూడెం భరత్‌కాలనీ

కాసిపేట: ప్రభుత్వం మారినా, గుర్తింపు సంఘం మారినా సోమగూడెం కార్మిక కుటుంబాల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. యాజమాన్యం నిర్లక్ష్యం, నాయకుల పట్టింపులేనితనంతో కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోల్‌బెల్ట్ ఏరియాలైన శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో యాజమాన్యం గోదావరి నీటిని సరఫరా చేస్తోంది. మందమర్రి ఏరియాలోని సోమగూడెం భరత్ కాలనీలో మాత్రం మూడేళ్లుగా గోదావరి నీటి సరఫరాకు నోచుకోవడం లేదు. దీంతో ఓపెన్‌కాస్టు నీటిని కాలనీకి సరఫరా చేస్తున్నారు. పేరుకు గోదావరి నీటిని కలిపి సరఫరా చేస్తున్నట్లు చెప్తున్నప్పటికీ, ఓసీ నీరు కావడంతో కలుషితంగా ఉంటోంది. దీంతో నీటిపైన చమురు మాదిరి తేలడంతో, నీరు ఎందుకూ పనికిరాకుండా మారుతోంది. చర్మవ్యాధులకు గురవుతున్నారు. ఆ నీటి కారణంగా ప్యూరిఫైడ్‌లు తరుచూ చెడిపోతుండటంతో కార్మిక కుటుంబాలు చాలా మంది వాటర్ ప్యూరిఫైడ్‌లు పక్కన పెట్టి షాపుల్లో నీటి క్యాన్‌లు కొనుక్కుని తాగుతున్నారు. ఎన్నిసార్లు రిపేర్ చేసినా, నీరు మారే వరకు ప్యూరిఫైడ్‌ల పరిస్థితి ఇదేనని మెకానిక్‌లు చెబుతున్నారు.

స్నానానికి కూడా పనిచేయవు...

కాలనీకి సరఫరా అయ్యే నీరు స్నానానికి కూడా పనిచేయవని పలువురు ఆరోపిస్తున్నారు. నీటిలో టీడీఎస్(టోటల్ డీజల్వ్‌డ్ సాలిడ్స్) 600లోపు ఉండాల్సి ఉండగా ఓసీ నుంచి సరఫరా అయ్యే నీరు కావడంతో నీటిని తనిఖీ చేస్తే 1200 టీడీఎస్ ఉంది. దీంతో నీటిలో అన్నిరకాల వ్యర్థపదార్థాలు, టీడీఎస్ మోతాదు దారుణంగా ఉందని వాపోతున్నారు. 300క్వార్టర్లు, ఇతర నివాసాలు కలుపుకొని 400కు పైగా గృహాలకు నీరందించే సింగరేణి యాజమాన్యం, నాయకులు ఇంత జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై కార్మిక కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి తనిఖీలో అధికారుల నిర్లక్ష్యం...

సింగరేణిలో నియమాల ప్రకారం ప్రతినెలా కేటాయించిన సమయం ప్రకారం గనులు, ఏరియాలోని నీటి వనరులు, సరఫరా చేసే నీటిని పరీక్ష చేసి ల్యాబ్ రిపోర్టును కార్పొరేట్‌కు పంపించాల్సి ఉంటుంది. ఏరియాలో ఆ ప్రక్రియ నిలిచిపోయి చాలా రోజులు అవుతుందనే విమర్శలున్నాయి. సోమగూడెంకు సరఫరా అయ్యే ఓసీ వృథా నీటిని పరీక్షించినా, కార్పొరేట్‌కు పంపించినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం ఖాయం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఓసీల నీటిని మొక్కల పెంపకం లేదా వృథాగా బయటకు పంపించి నీటి వనరులు వృద్ధి చేస్తారు.. ఎక్కడా లేని విధంగా కాలనీకి సరఫరా చేయడం, అధికార యంత్రాంగం, నాయకులు చోద్యం చూడటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గోదావరి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



సోమగూడెం సమస్యపై ఇప్పటికి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే సమస్య పరిష్కరించనట్లైతే కార్మిక కుటుంబాలతో కలిసి ఆందోళనలకు సిద్ధం అవుతాం. వెంటనే కలుషిత నీటి సరఫరా నిలిపివేసి అన్ని కాలనీల మాదిరి గోదావరి నీరు సరఫరా చేయాలి. లేనట్లైతే యూనియన్ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు ప్రారంభిస్తాం.

– దాగం మల్లేష్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



కోటపల్లి: వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

రామకృష్ణాపూర్: లంబాడి జేఏసీ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. లంబాడి జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షులు తేజావత్ రాంబాబు మాట్లాడుతూ.. సర్వమతాలను సమానంగా చూస్తూ సమాజ అభివృద్ధి కోసం, పరిరక్షణ కోసం సేవాలాల్ మహరాజ్ ఎన్నో ప్రభోధనలను చేశారని వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లంబాడి నాయకులు రామారావు, సీతారాంనాయక్, రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేటలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేశ్, సంపత్, సమ్మయ్యనాయక్ పాల్గొన్నారు.

ఖిర్జీలో సమ్మక్క సారక్క జాతర



వనదేవతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

నెన్నెల: మండలంలోని జంగల్‌పేట పంచాయతీ పరిధిలో ఖిర్జీ అటవీ ప్రాంతంలో గురువారం సమక్క–సారక్క జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి వనదేవతలను ఆదివాసీ సంప్రదాయాలతో శివసత్తుల పూనకాల మధ్య బాజాభజంత్రీల మధ్య అమ్మవార్లను గద్దెల వద్దకు తరలించారు. దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క–సారక్కల విగ్రహాలను పసుపు కుంకుమలతో అలంకరించారు. అమ్మవార్ల సన్నిధిలో భక్తజనం దర్శించుకొని నిలువెత్తు బంగారం (బెల్లం)తో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు నెన్నెల, కన్నెపెల్లి, కోటపల్లి, వేమనపల్లి మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రోజంతా విడిది చేసి ఆటపాటలతో గడిపారు. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పూజారి అద్దెలపల్లి బాపు తెలిపారు. ఈ జాతర మూడు రోజులు పాటు కొనసాగుతుందన్నారు.

దుకాణాలకు వేలం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామ గోదావరి నది తీరాన ఈ నెల 21 నుంచి నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతరలో దుకాణాలకు వేలం నిర్వహించారు. మొత్తం దుకాణాల వేలం రూ.47వేలు లభించినట్లు తెలిపారు. కౌన్సిలర్లు నాగభూషణం, సురేష్‌నాయక్, సభ్యులు మల్లయ్య, నిమ్మ రత్నాకర్, రామన్న, రాజగురువయ్య, కుమారస్వామి, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'షేర్ టు కేర్' ప్రారంభం



అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షేర్ టు కేర్ అనే నూతన కాన్సెప్ట్ ప్రారంభమైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రయోజనం కలగాలనే సదుద్దేశ్యంతో 'షేర్ టు కేర్'కు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలలో, ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల్లో అడిగే ముఖ్యమైన ప్రశ్నలను పుస్తకాల నుంచి సేకరించి ఆన్‌లైన్‌లో గూగుల్ ఫామ్ ద్వారా విద్యార్థులకు అందించడం షేర్ టు కేర్ లక్ష్యమన్నారు. ఈ తీరు వల్ల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రోజువారీగా విద్యార్థులు గూగుల్ ఫామ్ ద్వారా ప్రశ్నలు తెలుసుకునే సౌలభ్యం కలుగుతుందని, తద్వారా విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల్లో నెగ్గుకు రాగలుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపకులు కళాశాలలోని కార్యశాల ద్వారా అధ్యాపకులు ప్రశ్నలు తయారు చేస్తారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న సిబ్బంది

జన్నారం: గ్రామ పంచాయతీల పరిశుభ్రత విషయంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ప్రత్యేక అధికారి తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్ పేర్కొన్నారు. జన్నారం గ్రామ పంచాయతీలో గురువారం పారిశుధ్య వారోత్సవాలు పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులున్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి ముక్కిడి పోచమ్మ వద్ద జరిగే సమ్మక్క– సారలమ్మ జాతర ఏర్పాట్లను గుర్తింపు సంఘ ఏఐటీయూసీ నాయకులు సందర్శించారు. ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచీ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గురువారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కంపెనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు ఘనంగా చేయాలన్నారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, నాయకులు ఆడెపు మల్లిఖార్జున్, అఫ్రోజ్‌ఖాన్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు రిటైర్డ్ కార్మికుల మద్దతు'

శ్రీరాంపూర్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సింగరేణి రిటైర్డ్ కార్మికులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వడానికి ముందుకు రావడం హర్షనీయం అని ఆ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ నాయకుడు పెర్క శ్యాం తెలిపారు. నస్పూర్ షిర్కేకాలనీలోని రిటైర్డ్ కార్మికుల కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. దీనికి సింగరేణి రిటైర్డ్ కార్మికులు హాజరయ్యారు. పెర్కశ్యాంను సన్మానించి ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే తాము మద్దతిచ్చి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికుల సంఘం నాయకులు నూనె మల్లయ్య, కమతం సతీశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెకు బీఎంఎస్ దూరం'

శ్రీరాంపూర్: దేశ వ్యాప్తంగా శుక్రవారం కొన్ని కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు తాము దూరంగా ఉంటున్నామని బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో కార్మికులు సమ్మెలో పాల్గొనకుండా విధులకు హాజరుకావాలన్నారు. రాజకీయ ప్రేరేపిత సమ్మెతో కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. బొగ్గు ఉత్పత్తిలో ఇప్పటికే సింగరేణి వెనుకబడి ఉందని ఈ సమయంలో సమ్మెలో పాల్గొనరాదని తెలిపారు. సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం విధులకు హాజరవ్వాలన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'ఓసీలో కార్మికులకు రక్షణ కల్పించాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీలో పనిచేస్తున్న కార్మికులకు అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం ఓసీ మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఓసీలోని క్వారీలో డిప్‌సైడ్, సౌత్‌లో పనిచేస్తున్నప్పుడు అడవి జంతువులు వస్తున్నాయని అలాగే కరెంటు కేబుల్, ఇనుప వస్తువుల కోసం దొంగలు ఆయుధాలతో దాడి చేస్తుండటంతో భయంభయంగా విధులు నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటంలో ఉన్న శ్రద్ధ వారి రక్షణపై కూడా చూపాలని విన్నవించారు. ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి రమేష్ నాయకులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



భీమారం: స్వాగతం పలుకుతున్న సిబ్బంది



లక్సెట్టిపేటలో బాధ్యతలు స్వీకరిస్తున్న సరోజ





నెన్నెల/చెన్నూర్‌రూరల్/భీమారం/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో నూతన ఎంపీడీవోలు గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా నెన్నెల ఎంపీడీవోగా దేవేందర్‌రెడ్డి, చెన్నూర్ ఎంపీడీవోగా మోహన్, భీమారం ఎంపీడీవోగా రాధారాథోడ్, హాజీపూర్ ఎంపీడీవోగా మధుసూధన్, లక్సెట్టిపేట ఎంపీడీవోగా సరోజ బాధ్యతలు స్వీకరించారు. కాగా పలు మండలాల్లో ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోలను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామ గోదావరి నది సమీపంలో సప్ప ప్రసాద్ అనే రైతు గేదె విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. సుమారు ఎనభై వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మంచిర్యాల ఎస్సైగా రాజవర్ధన్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎస్సైగా గుండేటి రాజవర్ధన్‌ను నియమిస్తూ మల్టీజోన్ ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఏ.రాజేందర్‌ను ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీల్లో భాగంగా కోటపెల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న రాజవర్ధన్‌ను బదిలీ చేశారు.

మందమర్రి ఎస్సై బదిలీ

మందమర్రిరూరల్: మందమర్రి ఎస్సై చంద్రకుమార్‌ను లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. మందమర్రి రెండో ఎస్సైగా రెండు రోజుల క్రితం బదిలీపై వచ్చిన రాజశేఖర్‌కు ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. బదిలీపై వెళ్తున్న చంద్రకుమార్‌ను సిబ్బంది సన్మానించారు.

రేపు ఆయుర్వేద వైద్యశిబిరం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో శనివారం ఆయుర్వేద వైద్య శిబిరం ఉంటుందని ఏరియా పర్సనల్ మేనేజర్(పీఎం) సల్ల శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏడీఏ తనిఖీలు

జన్నారం: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో గురువారం మంచిర్యాల ఏడీఏ సురేఖ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, స్టాక్‌ను పరిశీలించారు. ధరలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు రాసుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో సంగీత, ఏఈవో అక్రముల్లా తదితరులున్నారు.

ఆలయంలో అభిషేక పూజలు

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్‌లోని శ్రీ భక్త మార్కండేయ శివాలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అభిషేక పూజలు నిర్వహించారు.

నేటి గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు



నస్పూర్: సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 16వ తేదీ శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చ, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీలు తలపెట్టిన గ్రామీణ బంద్ సమ్మెకు ప్రగతిశీల మహిళా సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ తెలిపారు. ముల్కల్ల, రాపల్లి గ్రామాల్లో గురువారం ఈజీఎస్ కూలీలు, బీడి కార్మికుల వద్దకు వెళ్లి ప్రచారం చేసిన అనంతరం మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని, వంద రోజుల కార్మికుల పని దినాలను పెంచాలని, వంద రోజుల కూలీలకు రూ.300పెంచాలని డిమాండ్ చేశారు. సమ్మెకు పూర్తి మద్దతు తెలియజేస్తుండగా, వంద రోజుల పని బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.జ్యోతి, కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

చెన్నూర్: గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. సమ్మెలో భాగంగా ఉదయం 10:30గంటలకు స్థానిక పెద్ద చెరువు రావిచెట్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోపినాథ్, చందు, మాసాని రమేశ్, జిమిడి కుమార్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

నేటి సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

నస్పూర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక విధానాలను నిరసిస్తూ నేడు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేస్తూ కార్మిక వ్యతిరేఖ నల్ల చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. నేడు నిర్వహించే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు ఉదయం 10గంటలకు నర్సయ్య భవన్ నుంచి ర్యాలీగా బయలు దేరి శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు వీరభద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా జిల్లా కార్యదర్శి దాసు, సహాయ కార్యదర్శి లింగం రవి, నాయకులు కొమురయ్య, సారయ్య, అఫ్రోజ్‌ఖాన్, మల్లిఖార్జున్, మల్లయ్య, చంద్రశేఖర్, నవీన్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీ విద్యాలయం తనిఖీ

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూరిబా విద్యాలయంలో ఉన్న బియ్యం ఇతర సరుకులను పరిశీలించి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి భోజనం మెనూ ప్రకారంగా పెడుతున్నారా, ఆహారం నాణ్యతగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. నెల రోజుల నుంచి కోడిగుడ్లు రావడం లేదని చెప్పారు. చికెన్ సరిగానే పెడుతున్నట్లు తహసీల్దార్‌కు విద్యార్థులు వివరించారు. కాగా మరుగుదొడ్లు సరిగ్గాలేవని మరమ్మతు చేయించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా ఉపాధ్యాయులతోనూ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ పేర్కొన్నారు.